క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

పాల్వంచ: స్థానిక వికలాంగుల కాలనీ యూసీఎఫ్ హాల్‌లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా హాజరై మాట్లాడారు. క్రైస్తవులు యేసు చూపిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, యూసీఎఫ్ నిర్వాహకులు దేవదాస్, జాన్‌విల్సన్, యేసుదాస్, రవి, కోటీశ్వరరావు, ఆంద్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలను వర్గీకరించండి..


మాట్లాడుతున్న గురునాథం

జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణ చేసే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు వెలవరించిన చారిత్రాత్మక తీర్పు ఆధారంగా తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చెంగల గురునాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జూలూరుపాడులో జరిగిన ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో 59 ఉపకులాలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దిబ్బెందుల సాయికుమార్, చాపలమడుగు రామ్మూర్తి, కాకటి కృష్ణ, గార్లపాటి శివకృష్ణ, చెంగల నరసింహారావు, కె.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తి

కొత్తగూడెంఅర్బన్: జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆనంది మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్, వైద్యులు దుర్గాప్రసాద్ సహకారంతో శనివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతం అయింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందితో పాటుగా 500 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు బత్తుల రామారావు, ఎ.సుచరిత, కె.సాయిశ్రీ, బార్ అసోసియేషన్ ప్రతినిధులు బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు, కార్యదర్శి ఎమ్మెస్సార్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డెంటల్ యూనిట్‌లో శనివారం ఇద్దరు డెంటిస్టులు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 5న సాక్షి దినపత్రికలో 'నిలిచిన దంత వైద్యసేవలు' అనే కథనం ప్రచురితం అయింది. స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు దంత వైద్యనిపుణులను నియమించారు. బూర్గంపాడు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న డెంటిస్టులు మౌనిక, శాంతిప్రియ డిప్యూటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. స్థానిక పీహెచ్‌సీలో నిలిచిన దంతసేవలు పునరుద్ధరణ చర్యల్లో భాగంగా ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకోవడంతో సేవలు అందుబాటులోకి రానున్నాయి. బాధ్యతలు చేట్టిన డాక్టర్లు మాట్లాడుతూ.. వారంలో మూడు రోజుల చొప్పున ఇక్కడ విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఐక్య తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడిగా వేణుమహేష్


నియామకపత్రం అందజేస్తున్న మారుతి రత్న

కొత్తగూడెంఅర్బన్: ఐక్య తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వేణుమహేష్ నియమితులయ్యారు. కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు మారుతి రత్న నియామకపత్రం అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల భిక్షపతి, నాయకులు పామర్తి అంకినీయుడు ప్రసాద్, చీకటి ప్రసాద్, గుమలాపురం సత్యనారాయణ, విక్కీ రాయ్, వసంత్ పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన, పౌష్టికాహారమే

ప్రభుత్వ లక్ష్యం

- గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో నూతన డైట్ మెనూ ప్రారంభం
- పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటూ బాగా చదువుకుని భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కొత్తగూడెం డిప్యూటీ తహసీల్దారు అజ్మద్‌పాషా అన్నారు. శనివారం రామవరంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో నూతన డైట్ మెనూ ప్రారంభించి మాట్లాడారు. ఆర్‌ఐ అబ్దుల్‌అలీ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: నాణ్యమైన బోధన, పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో నూతన డైట్ మెనూ అమలు సందర్భంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ద్వారా మెరుగైన విద్యాబోధనకు కృషి చేస్తున్న ప్రభుత్వం నూతనంగా డైట్ చార్జీలను భారీగా పెంచిందని గుర్తుచేశారు. డీఎస్పీ చంద్రభాను మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థులకు మంచి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుంటూ బాగా చదువుకోవాని సూచించారు. ఏటీడీఓ రాధమ్మ మాట్లాడుతూ.. నూతన మెనూను పక్కగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అనంతరం ఆయా గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సహపంక్తి భోజనం చేశారు.

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, పోస్ట్ మెట్రిక్ హాస్టల్, జూలూరుపాడు ఎస్సీ హాస్టల్‌లో న్యూ కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని శనివారం తహసీల్దార్ కె.స్వాతి బిందు, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధమైన డైట్ మెనూ ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో తరగతి గదులను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం అధికారులు భోజనం నాణ్యత, రుచిని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, పంచాయతీ కార్యదర్శులు హారిక, హరిబాబు, ఏజీహెచ్ఎస్ హెచ్ఎం సుభద్రమ్మ, పీఎంహెచ్ వార్డెన్ తార, జూలూరుపాడు ఎస్సీ హాస్టల్ ఇన్‌చార్జ్ వార్డెన్ శశికళ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మంగీలాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన మెనూను మున్సిపల్ కమిషన్ పిజేశేషఅంజనస్వామి, బీసీ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.ఇందిర శనివారం ప్రారంభించారు. వసతి గృహ సంక్షేమ అధికారి కె.హిమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: ప్రభుత్వం వసతి గృహాల్లో నూతన మెనూ అమలు చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు.

శనివారం స్థానిక నవభారత్ శేఖరం బంజరలోని కొత్తగూడెం మైనార్టీ పాఠశాలలో కామన్ డైట్ ప్రొగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.రాంబాబు, జమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బొల్లేరుగూడెంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (మణుగూరు)లో నెలవారీ డైట్ టైమ్ టేబుల్‌ను ఎంఈఓ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కీసర నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వాసం పెంచటమే లక్ష్యం..

ఇల్లెందు: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజలకు విశ్వాసం కలిపించటమే లక్ష్యంగా ముందుడుగు వేస్తోందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఇల్లెందు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకుల పాఠశాల, కళాశాలల్లో నూతన మెనూ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రభాను, ప్రిన్సిపాల్స్ కృష్ణ, ముద్దసిర్ హుస్సేన్, జీసీసీ మేనేజర్ నరసింహారావు, భూషణం పాల్గొన్నారు.

కొత్త మెనూ ప్రారంభం..

టేకులపల్లి: విద్యార్థులకు పోషకాహారం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కొత్త డైట్ మెనూని ప్రవేశపెట్టిందని టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్, ఎంఈఓ అజ్మీర జగన్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ ముత్తయ్య అన్నారు. ఈ మేరకు శనివారం ఎంజేపీ గురుకులం, కోయగూడెం ఆశ్రమ పాఠశాలల్లో కొత్త మెనూని ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు.


ఇల్లెందు: బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చైర్మన్ డీవీ


పాల్వంచ: డైట్ టైమ్ టేబుల్‌ను విడుదల చేస్తున్న ఎంఈఓ శ్రీరామ్మూర్తి


ఇల్లెందురూరల్: గురుకులంలో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను


జూలూరుపాడు: మాట్లాడుతున్న తహసీల్దార్ స్వాతిబిందు


కొత్తగూడెంరూరల్: వసతి గృహంలో మాట్లాడుతున్న కమిషనర్


టేకులపల్లి బీసీ గురుకులంలో మెనూ చార్ట్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ, ఎంఈఓ తదితరులు


కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉపాధ్యాయులు

17న వెల్ బేబీ షో


మాట్లాడుతున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని వివిధ డిపార్ట్ మెంట్లలో పని చేస్తున్న సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఈనెల 17న వెల్ బేబీ షో ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్య తెలిపారు. శనివారం ఇల్లెందులో మాట్లాడుతూ.. సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏడాది నుంచి ఐదేళ్ల లోపు పిల్లలు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఇమ్యూనైజేషన్ వివరాలు ఉద్యోగి ఐడెంటీ కార్డు వెంట తీసుకుని రావాలని కోరారు.

పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ రెహమాన్ తెలిపారు. శనివారం డీఎస్పీ ఆఫీసులో పరీక్ష నిర్వహణపై పోలీసుల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పరీక్ష నిబంధనలు కచ్చితంగా అమలు జరిగేవిధంగా విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఐ కరుణాకర్, శివప్రసాద్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్మనెంట్ చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే పర్మనెంట్ చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారం ఐదోరోజుకు చేరుకున్న సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపి మాట్లాడారు. సమ్మెకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, మాలోత్ వీరూనాయక్, నాగుల రవికుమార్, తాటిపాముల హరికృష్ణ, రంజిత్ పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రిజిస్ట్రేషన్ పట్టా నిబంధనను సడలించాలని మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు అధికారుల తీరును తప్పు పట్టారు. శనివారం రామవరంలోని నేతాజీ బస్తీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి పథకం రామవరం ప్రాంతానికి వర్తించలేదని అప్పుడు కూడా ఇలాగే సర్వే చేసి రామవరం ప్రాంతం 1/70 చట్ట పరిధిలో ఉందని, సింగరేణి యాజమాన్యం పరిధిలో ఉన్నందున అప్పుడు రామవరం ప్రాంత ప్రజలకు తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ఆర్ ప్రభుత్వంలో 1800 వందల ఇళ్ల మంజూరు చేశారని, అప్పుడు లేని నిబంధన ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. ఈ సమావేశంలో తమ్మ సత్తి, రామ్ రాకేష్, కాటం రాజ్, గుమ్మడి శ్రీను, మార్తమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

సూపర్‌బజార్‌ను పునరుద్ధరించండి..


సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి రామవరం సూపర్‌బజార్‌ను పునరుద్ధరించాలని, సింగరేణి సూపర్‌బజార్లను ప్రక్షాళన చేసి కార్మికులకు సేవలందించాలని, సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జి.వెంకటేశ్వరరెడ్డికి ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రామవరం ప్రాంతంలోని కార్మిక కుటుంబాలకు సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు అందించేందుకు సింగరేణి యాజమాన్యం సూపర్‌బజార్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కానీ అది కొంతకాలం నడిచిన తరువాత సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరిందని, మళ్లీ పలు కార్మిక సంఘాలు రామవరం సూపర్‌బజార్‌ను అభివృద్ధి చేయాలని కోరడంతో సర్వే చేసి, బడ్జెట్ కేటాయించి నిలిపివేసినట్లు తెలిపారు. అట్టి సూపర్‌బజార్‌ను పునరుద్ధరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వంగా వెంకట్, ఎస్‌వీ రమణమూర్తి, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కథల సంపుటి పుస్తకం అందజేత

ఇల్లెందు: ఇల్లెందు టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ, సాహితీవేత్త ఎస్.రంగనాథ్ 'ప్రాణం తీసిన పైసలు' కథల సంపుటి పుస్తకాన్ని రచించారు. ఈ మేరకు మాజీ సాంస్కృతిక శాఖ సలహాదారులు, దేవాదయశాఖ కార్యదర్శి, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్, ఐఏఎస్ అధికారి కేవీ రమణాచార్యులు, సింగరేణి సీఎండీ బలరాంను శనివారం హైదరాబాద్‌లో వారి వారి కార్యాలయాల్లో కలిసి తన పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ కృషిని వారు అభినందించారు. మరెన్నో పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ ఉన్నారు.

జీపీ కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 17న జరపతలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని, గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో జేఏసీ నాయకులు మాట్లాడుతూ... శాసనసభ ఎన్నికలకు ముందు జరిగిన నిరవధిక సమ్మె సందర్భంగా ఆనాటి ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఆపార్టీ నాయకులు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా కాలం గడుపుతున్నారని ఆరోపించారు. ఈ చర్యలకు నిరసనగా ఈనెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమం జరపతలపెట్టటం జరిగిందని ఈ సదస్సు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ ఇఫ్టూ, నాయకులు మధుసూదన్‌రెడ్డి, జటంగు వెంకన్న, పాలడుగు ఎడవెల్లి శ్రీను, గోపారావు, మహేష్, పాలడుగు సుధాకర్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం బీసీ కళాశాలలో నవంబర్ 14 నిర్వహించిన ఎస్ఏ రైటింగ్ పోటీలలో విజేతలకు జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి ఇందిర శనివారం బహుమతులు అందజేశారు.

ఫ్రీజర్ వితరణ


ఫ్రీజర్ అందజేస్తున్న దృశ్యం

పాల్వంచ: పాల్వంచ మండల, పట్టణంలోని క్రైస్తవుల సౌకర్యార్థం.. కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన ఎల్‌జీఎం చర్చి పాస్టర్ సాధు టైటస్ ఫ్రీజర్‌ను వితరణ చేశారు. శనివారం వికలాంగుల కాలనీలో యూసీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ ఆరాధన సందర్భంగా టైటస్ తన తల్లిదండ్రులు లిటిల్ దేవసహాయం – కేథరిన్‌ల జ్ఞాపకార్థం రూ.65వేల విలువ చేసే ఫ్రీజర్‌ను ఫిన్నీ చేతుల మీదుగా అందించారు. ఫిన్నీ మాట్లాడుతూ.. క్రైస్తవ కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే ఈ ఫ్రీజర్‌ను ఉచితంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూసీఎఫ్ వ్యవస్థాపకులు దేవదాస్, డైరెక్టర్ జాన్‌విల్సన్, అధ్యక్ష, కార్యదర్శులు యేసుదాస్, రవి, యోబు, ఆంద్రేయ, ఎల్‌జీఎం చర్చి సభ్యులు ఆర్.సంజీవ్ కుమార్, ప్రసాద్, తిమోతి, అబ్రహం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయండి..


రగ్గులు, స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: పేదలకు సాయం చేసేందుకు ప్రతీఒక్కరు ముందుకు రావాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని సారెకల్లు గ్రామంలో ఆదివాసీ గిరిజనులకు జనహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు బేర లక్ష్మి ఆధ్వర్యంలో 30 కుటుంబాలకు రగ్గులు, స్వెట్టర్లను కొత్వాల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. పేదలకు సేవ చేస్తే దేవుడి కరుణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు రెడ్డిపల్లి స్వప్న, అన్నవరపు నాగ శిరోమణి, వనపర్తి సతీష్, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, ఉండ్రాతి రవి, వై.వెంకటేశ్వర్లు, యాకిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం..


లోక్ అదాలత్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు: కక్షిదారులు క్షణికావేశంలో పెట్టుకున్న పోలీసు కేసులు రాజీ పడదగిన వాటిలో మనోవర్తి, గృహహింస, చెక్ బౌన్స్, ప్రామిసరీ నోటు కేసులలో ఇరువర్గాలు కోర్టుకు వచ్చి రాజీ పడితే ఇరువర్గాలు గెలిచినట్లే అవుతుందని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి తెలిపారు. శనివారం ఇల్లెందు కోర్టులో లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఒకసారి లోక్ అదాలత్‌లో రాజీ పడితే హైకోర్టుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. గ్రామాల్లో పెద్దల సమక్షంలో చేసుకునే రాజీలకు చట్టబద్ధత ఉండదన్నారు. క్రిమినల్ కేసులు 79, మనోవర్తి కేసులు మూడు, గృహహింస కేసు ఒకటి, ఎస్‌టీసీ కేసులు 116, పీఎల్‌సీ కేసులు 35, సివిల్ కేసులు ఆరు పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తీక్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సా..గుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఇల్లెందు: పట్టణంలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సాగుతోంది. శనివారం ఇల్లెందు పట్టణంలోని 24 వార్డుల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. ఆయా వార్డుల్లో వార్డు ఆఫీసర్లు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి లబ్ధిదారుల సమాచారం అప్‌లోడ్ చేశారు. వార్డు ఆఫీసర్లు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఈ సర్వే టీంలతో పాటు సమాచారాన్ని సేకరించారు. అప్‌లోడ్ తీరును పరిశీలించారు. 23వ వార్డులో జరిగిన సర్వేలో వార్డు ఆఫీసర్ నాగేశ్వరరావు, కౌన్సిలర్ కుమ్మరి రవీందర్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు నిర్మల, నరేష్, సత్యనారాయణ, అంజమ్మ తదితరులు ఉన్నారు.

ప్రజాపంథా నాయకుడు కృష్ణయ్య మృతి

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ మండల నాయకుడు మండ్రాజుల కృష్ణయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. శనివారం కృష్ణయ్య భౌతికాయాన్ని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ, మండల కార్యదర్శి బానోత్ ధర్మా, జిల్లా నాయకులు వై.గోపాల్‌రావు, రాయల సిద్ధు సందర్శించి, పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు మాట్లాడుతూ... కృష్ణయ్య విద్యార్థి దశలో పీడీఎస్‌యూ, పీవైఎల్, రైతు సంఘ నాయకుడిగా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని, అతని మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్, సీపీఎం నాయకుడు కడియాల సత్యనారాయణ, లింగాల వీరభద్రం, జవహర్‌లాల్, తాటి నరసింహారావు, తోటకూరి నరేష్, బానోత్ వీరు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఉన్నారు.

'మన సంస్థ.. మన గని.. మన బాధ్యత'


హాజరైన నాయకులు, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): మన సంస్థ.. మన గని.. మన బాధ్యతలను వివరించడానికే మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాన్ని సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తోందని, కార్మికులు కంపెనీ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఏరియా వర్క్‌షాపు, ఆర్‌సీహెచ్‌పీలలో మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యనారాయణ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ చైర్మన్ ఆదేశాలకు అనుగుణంగా ఏరియా జీఎం దిశానిర్దేశంలో ఏరియాలో మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. బొగ్గు వినియోగం పెరిగినందున వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును రవాణా చేసి సంస్థ లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం డీజీఎం (ఐఈడీ) ఎన్.యోహాన్ సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, మిషనరీ పనితనం, ఉత్పత్తి వ్యయం, ఉద్యోగుల సంక్షేమం విషయంలో కంపెనీ తీసుకుంటున్న జాగ్రతలు, వాటిని కార్మికులు ఏవిధంగా వినియోగించుకోవాలి అనే అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏఐటీయూసీ సెక్రటరీ జే.గట్టయ్య, ఏజీఎం ఫైనాన్స్ కే.హనా సుమలత, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణ, డీజీఎంలు సోమశేఖర్‌రావు, సీనియర్ పీఓ మురళి, ఎస్ఈ (ఈఅండ్ఎం) కరీముల్లా, కేఆర్ నాగభూషణం, ఏరియా వర్క్ షాపు ఇంజనీర్లు బి.శంకర్, అనిల్, ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.